క్లుప్తంగా

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ



వృద్ధురాలికి బియ్యం అందజేస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము మంగళవారం వృద్ధులు, పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ప్రతి నెల నిర్వహించే సేవా కార్యక్రమాలలో భాగంగా ఆయన పేదలు, వృద్ధులకు ఇంటింటికీ వెళ్లి 5 కేజీల చొప్పున సుమారు 30 మందికి బియ్యం పంపిణీ చేశారు.

బాలిక అదృశ్యం



హారిక (ఫైల్)

అల్లిపురం : గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదని ఆమె సోదరి జగదీ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 28వ తేదీ ఉదయం 11.30 గంటల సమయంలో ఎదురింటి ఆంటీతో గుడికి వెళ్లి వస్తానని వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో వారు నగరంలో పలు ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ తెలియకపోవటంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన బాలిక ఆచూకీ తెలిస్తే 89198 12412, 9440904716 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని తెలిపారు.

పిల్లలను పాఠశాలకు పంపాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో, అధికారులు, విద్యార్థులు

పెందుర్తి: బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని మండల విద్యాశాఖాధికారి కె.సువర్ణ అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం దొగ్గవానిపాలెం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కె.గౌతమ్ అనే విద్యార్థిని పాఠశాలలో చేర్పించి కిట్ అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, హెచ్ఎం కె.మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

- తక్కువ ఎత్తులో నిర్మించిన చోట ప్రమాదాలకు ఆస్కారం
- బాధితులుగా మారుతున్న పాదచారులు.. వాహన చోదకులు.. పిల్లలు
- తగిన చర్యలు తీసుకోవాలని పలు కాలనీల ప్రజల అభ్యర్థన

జ్ఞానాపురంలోని నిరుపేదలుండే అనేక కాలనీల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. కొన్ని చోట్ల ఇవి తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయటం వల్ల పాదచారులు, వాహన చోదకులు, పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఫ్యూజ్ బాక్సులకు తలుపులు లేని చోట కూడా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. లోవోల్టేజీ సమయంలో ఇక్కడి కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలు చెలరేగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



ఎర్రిగెడ్డకి వెళ్లే చోట ఇలా..



సెబాస్టియన్ కాలనీ రహదారిలో ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్

కంచరపాలెం : జ్ఞానాపురంలో అనేక చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్స్‌లు ప్రమాదకరంగా మారాయి. దీంతో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతుండటంతో తరచూ పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ వేసిన కంచెలను ఎవరో తొలగిస్తున్నారు. కంచె ఉన్నా కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరే కొందరు మూత్ర విసర్జన చేస్తున్నారు. బాబు కాలనీలో పదిహేనేళ్ల బాలుడు కరెంట్ తీగలు తగిలి ప్రాణాలు విడిచిన సంఘటన.. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో గతంలో ఓ వ్యక్తికి తీగలు తగిలి ప్రమాదానికి గురైన సంఘటన చోటు చేసుకున్నాయి.

సెబాస్టియన్ కాలనీలో ఇళ్ల ముందున్న ట్రాన్స్‌ఫార్మర్ గట్లపై బట్టలు ఆరేస్తూ పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఇనుప కంచెలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు. విద్యుత్ సిబ్బంది వీటి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. చాలా ప్రాంతాల్లో పాదచారులు వెళ్లే మార్గాల్లో ప్రమాదభరితంగా ఇవి ఉండటంతో అటుగా వెళ్లేటప్పుడు భయాందోళనకు గురవుతున్నారు. స్మార్ట్ సిటీలో ట్రాన్స్‌ఫార్మర్లకు శాశ్వత పరిష్కారం చేపడతామని, విద్యుత్ వ్యవస్థను అండర్ గ్రౌండ్‌కు మార్పు చేస్తామని చెప్పిన అధికారులు మురికివాడల్లో ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఈ సమస్యపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఇనుప కంచెలు వేయాలని పలువురు కోరుతున్నారు.



మాన్యువల్ స్ట్రీట్ రహదారిలో..



జ్యోతి నిలయానికి వెళ్లే రహదారిలో ఇలా..

నిర్లక్ష్యం తగదు..



జ్ఞానాపురంలో పేదలు నివసించే పలు కాలనీల్లో అధికారులు నిర్లక్ష్యంతో తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్లర్లు నిర్మిస్తున్నారు. వాటికి కంచె కూడా వేయడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచాలని కోరినా ఎవరూ పట్టించుకోవటం లేదు. ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ ఫ్యూజ్ బాక్సులకు తలుపులు ఏర్పాటు చేయాలి.

– బూర మణికిరణ్, బాబుకాలనీ, జ్ఞానాపురం.

ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచాలి..



సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, గెడ్డవీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచి వాటికి వెంటనే రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి. ఆర్‌సీఎం పాఠశాల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ముందుకు రావాలి. లోవోల్టేజీ సమస్య టైంలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలొస్తున్నాయి. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం.

– మీనాల స్వర్ణలత, స్లీప్‌గుర్తువీధి, జ్ఞానాపురం.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలిగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఏకంగా రోడ్డునే ఆక్రమించి నిర్వహిస్తున్న పార్లర్ ముందు భాగాన్ని ఎట్టకేలకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. 27వ వార్డు ద్వారకానగర్‌లోని డైమండ్ పార్కు ఎదురుగా రోడ్డును ఆక్రమించి పార్లర్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గత నెల 26వ తేదీ బుధవారం 'సాక్షి'లో 'రోడ్డును ఆక్రమించి.. జోరుగా వ్యాపారాలు' అనే శీర్షికన ఈ అంశంపై వార్త ప్రచురితం అయింది. దీంతో అధికారులు స్పందించారు. మంగళవారం ఇక్కడి పార్లర్ ముందు భాగంలో ఉన్న ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. దీంతో స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా జోన్–3 పరిధిలో గల ఫుట్‌పాత్‌ల మీద నిర్వహిస్తున్న ఆక్రమణలను కూడా తొలగించాలని పలువురు కోరుతున్నారు.

జీవీఎంసీ దుకాణాలకు 9న వేలం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–8 పరిధి పెందుర్తి వాణిజ్య సముదాయంలో 2 దుకాణాలకు బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సముదాయంలో గల ఆయా దుకాణాలను మూడేళ్ల కాల పరిమితికి వేలం ద్వారా ఇచ్చేందుకు ఈ నెల 9 ఉదయం 11 గంటలకు జోన్–8 కార్యాలయంలో నిర్వహించనున్న బహిరంగ వేలంలో ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జోనల్ కార్యాలయ పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

గీతా పఠనంతో ఆధ్యాత్మిక వైభవం



ప్రత్యేక పూజలు చేస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : లోక కల్యాణార్థం విశ్వ శాంతిని కాంక్షిస్తూ వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల గీతా భవన్‌లో మహిళలచే సామూహిక సంపూర్ణ గీతా పారాయణ, విష్ణు సహస్రనామాలు, హనుమాన్ చాలిసా పారాయణ సాంప్రదాయ రీతిన నిర్వహించారు. గీతా ప్రచార సమితి, భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీభాయి మహిళా శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఏకాదశి పర్వదినం సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమాన్ని గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతను పఠించడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యంతో కూడిన మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. భారత్ వికాస్ పరిషత్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. గత 25 ఏళ్లకు పైగా ఆధ్యాత్మిక వైభవానికి నిస్వార్థ సేవలందిస్తున్న చావలి విశ్వేశ్వరరావును భారత్ వికాస్ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ రాష్ట్రస్థాయి ప్రతినిధి ఎంవీ రాజశేఖర్, విశాఖ శాఖ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, జీఎస్‌వీ మాణిక్యాలరావు, పి. షర్మిల, వనజ, శారద, మంజుల, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీ నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న చెత్త



రామకృష్ణా రైతుబజార్ వద్ద మురుగు, చెత్త

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు రామకృష్ణా రైతు బజార్ వద్ద మురుగు, చెత్తతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు హడలిపోతున్నారు. ఇక్కడ నిత్యం అపరిశుభ్ర వాతావరణం రాజ్యమేలుతోందని వ్యాపారులు, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అసలే వ్యాధుల కాలం కావడంతో మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపిస్తాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయంటున్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్త మాత్రమే తీస్తున్నారని, మురుగు తొలగించడం లేదని వాపోతున్నారు. కనీసం బ్లీచింగ్ చేసి దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇదే విధంగా ఫ్రూట్‌మార్కెట్, పూర్ణామార్కెట్ వెనుక భాగంలో ఉన్న చెత్త, మంచాలవీధి, వెలంపేట వద్ద చెత్తతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని మురుగుతో పాటు చెత్త తొలగించి దోమలు, వ్యాధుల బారి నుంచి కాపాడాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలి



నిరసన తెలుపుతున్న క్లైమేట్ ఫ్రంట్ సభ్యులు



అల్లిపురం మౌర్య హోటల్ వద్ద నరికేసిన చెట్టు

అల్లిపురం : పచ్చదనాన్ని ధ్వంసం చేసే చర్యలు మానుకోవాలని క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ సభ్యులు అన్నారు. మంగళవారం 32వ వార్డు పరిధి మౌర్య హోటల్ వద్ద రోడ్డుపై గల చెట్టును జనసేన వార్డు కార్యదర్శి నరికేస్తుండగా ఫ్రంట్ సభ్యులు అడ్డుకున్నారు. చెట్లు ట్రిమ్మింగ్ చేయాలి గాని నరకవద్దని నిరసన వ్యక్తం చేశారు. ఆ సమయంలో జనసేన కార్యదర్శి, వారి ప్రతినిధులు తమ సెల్‌ఫోన్లు లాక్కుని వేధించారని ఫ్రంట్ ప్రతినిధి ఓయింద్రిల భట్టాచార్య తెలిపారు. కాంక్రీట్ వనంలాంటి మహానగరాల్లో చెట్లు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని తెలుపుతూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యావరణ పరిరక్షణపై తన కార్యకర్తలకు అవగాహన కల్పించాలని సభ్యులు ఓయింద్రిలా, జయశ్రీ హతంగడి, అంజన, శరత్ కోరారు.

ఘనంగా బంగారమ్మ పండగ



భక్తుల పూజలందుకుంటున్న బంగారమ్మతల్లి

సింహాచలం: అడవివరం గ్రామ దేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి బంగారమ్మతల్లి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. గ్రామ సంప్రదాయం ప్రకారం రాత్రి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత అడవివరంలో ఉన్న బంగారమ్మ శతకంపట్టు నుంచి అమ్మవారి ఆలయం వరకు ఘటాలను పూజారి వంశస్తులైన లండ కుటుంబీకులు గ్రామంలో ఊరేగించారు. దారిపొడవునా అమ్మవారికి గ్రామస్తులు స్వాగతం పలికి పసుపుకుంకుమలు సమర్పించారు. ఘటాలను శిరస్సుపై పెట్టుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పోటీ పరీక్షల విజేతలకు అభినందనలు

మహారాణిపేట : సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ముగ్గురు, ఏపీపీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమినరీలో 12 మంది, గ్రూప్–2 ప్రిలిమినరీలో 80 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2023 సెప్టెంబర్ నుండి 2024 జూన్ వరకు వారికి శిక్షణ ఇచ్చామని, సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ కె.హర్షవర్ధన్, డైరెక్టర్ విజయలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాసన్ ఎంతో సహకరించారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను రామారావు అభినందించారు.

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



పూజలందుకుంటున్న సత్యనారాయణస్వామి

పెందుర్తి: ఏకాదశి సందర్భంగా పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, రాజ ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామివాకి అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

జాగ్రత్తలతోనే డయేరియాకు అడ్డుకట్ట

అల్లిపురం : ప్రజలు డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. భీమ్‌నగర్‌లో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో డయేరియా అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎస్వీ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఏటా జూన్ నుంచి డిసెంబర్ వరకు సీజనల్ వ్యాధులు సోకుతాయన్నారు. ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సీజన్‌లో సుమారు 399 మంది అదనపు సిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వన్‌టౌన్ రాణి బొమ్మకు హంగులు



రాణిబొమ్మ (పాత చిత్రం)



రాణి బొమ్మ (కొత్తచిత్రం)

జగదాంబ : జీవీఎంసీ అధికారులు పాతగనగరంలో అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో బ్రిటిష్ కాలం నాటి కట్టడాలు ఉన్నాయి. అలాగే వాటికి ప్రతీకగా బ్రిటిష్ రాణి విగ్రహం కూడా ఇక్కడ ఉంది. అయితే ఆ విగ్రహాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టూ మొక్కలు పెరిగి ఆ ప్రాంతమంతా అడవిలా తయారయింది. దీంతో గతంలో సాక్షిలో వచ్చిన కథనాలకు జీవీఎంసీ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకున్నారు. అలాగే ఇప్పుడు నిధులు మంజూరు కావటంతో రాణి బొమ్మ, చుట్టూ రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో పాతనగరానికి కొత్త కళ వచ్చినట్టయిందని స్థానికులంటున్నారు.

డ్రాయింగ్ పోటీలకు విశేష స్పందన



డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు



బొమ్మలు గీస్తున్న కళాశాలల విద్యార్థులు

దాబాగార్డెన్స్ : అల్లూరి జయంత్యుత్సవాలను పురస్కరించుకుని పాఠశాలల పిల్లలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాస రచన పోటీలకు విశేష స్పందన లభించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో పిల్లలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీలు ఈ నెల 4 వరకు జరుగుతాయని విజ్ఞాన కేంద్రం ప్రతినిధి దండు నాగేశ్వరరావు తెలిపారు. పోటీలకు సంబంధించి మరిన్ని వివరాలకు 9490750661 నంబరులో సంప్రదించాలన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్ : ప్రభుత్వం నూతనంగా రూపొందించిన కొత్త చట్టాల పట్ల మానవ హక్కుల పరిరక్షణకారులు, పోలీసులు అవగాహన కల్పించుకోవాలని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్, సోషల్ మీడియా రాష్ట్ర చైర్మన్ సన్ మూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన చట్టాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ సాక్ష్య అదిన్యం (బీఎస్ఏ), భారతీయ నాగరికత సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) 2023 చట్టాలు ఈ నెల ఒకటి నుంచి అమలైన సందర్భంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి, కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్వీ రమణ మాట్లాడుతూ కొత్త చట్టాలను అర్థం చేసుకోవడానికి పోలీస్ యంత్రాంగానికి కొంత సమయం పడుతుందన్నారు. న్యాయ శాస్త్రం అభ్యసించే విద్యార్థులు సైతం కొత్త చట్టాల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకురాలు శకుంతల, కౌన్సిల్ ప్రతినిధులు సాగర్, బాబు, సిబ్బంది నారీమణి, నారాయణమ్మ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.